నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 4 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆసిఫాబాద్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ విఠల్, బీఆర్ఎస్ నాయకులు

సీసీసీ నస్పూర్ : పార్టీ ఆఫీస్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు బాల్క సుమన్

అధైర్యపడకండి భవిష్యత్ మనదే

కోట్లాది ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- నస్పూర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు
- జాతీయ, పార్టీ జెండాల ఆవిష్కరణ
- పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మంచిర్యాల ఏసీసీ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ రావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

సీసీసీ నస్పూర్, జూన్ 3: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, శ్రేణులెవ్వరూ అధైర్య పడవద్దని, భవిష్యత్ అంతా మనదేనని బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. జాతీయ, పార్టీ జెండాలను ఎగురవేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయం, ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాలు, రాష్ట్ర ఆవిర్భావం, కేసీఆర్ పదేళ్లలో సాధించిన ప్రగతిపై ఎల్ఈడీ స్క్రీన్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శించగా, నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమనేత కేసీఆర్ చావునోట్లో తలపెట్టి, ఉక్కు సంకల్పంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, కోట్లాది ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని గుర్తు చేశారు. కేవలం ఒక్క శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 6 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. కరంట్ కోతలు, విత్తనాల కొరతతో రైతులు సతమతమవుతుంటే, అవ్వేమీ పట్టించుకోకుండా లోగోలు, పాటలు మార్చడం, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడంవంటి కక్షపూరిత విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పాలనపై ప్రజలతో పాటు ఆ పార్టీ కార్యకర్తలు కూడా అంసతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రజలు తమకు ఇచ్చిన ప్రతిపక్ష బాధ్యతను సమర్థవంతగా నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, డాక్టర్ రాజారమేశ్, అక్కూరి సుబ్బయ్య, గాదె సత్యం, తిప్పని లింగయ్య, గోగుల రవీందర్‌రెడ్డి, మేరుగు పవన్‌కుమార్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, మల్లెత్తుల రాజేంద్రపాణి, ఎండీ రఫీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మంచిర్యాల ఏసీసీ, జూన్ 3 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలోని రోగులకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మల్యే నడిపెల్లి దివాకర్ రావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఉక్కు సంకల్పంతోనే తెలంగాణ సాధ్యమైంది

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్
- జిల్లా కేంద్రంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఉద్యమ నేత కేసీఆర్ ఉక్కు సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైదని కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆదివాసుల చేసిన పోరాటం స్ఫూర్తికి అద్దం పట్టిందన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించారని, ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వైఫల్యాలను మూటగట్టుకుందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కోవ సాయినాథ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీసీసీ నస్పూర్ : దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

ఆసిఫాబాద్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

పార్లమెంట్ ఫలితం నేడే

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం

- ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో హాల్.. 14 టేబుళ్లు
- మొత్తం 136 రౌండ్లు.. ఒక్కో రౌండ్ కౌంటింగ్‌కు 15 నుంచి 20 నిమిషాలు
- మధ్యాహ్నానికల్లా తుది రిజల్ట్
- 24 గంటల పాటు 144 సెక్షన్ అమలు
- మద్యం విక్రయాలకు బ్రేక్

మంచిర్యాల, జూన్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఫలితం నేడు వెలువడనున్నది. ఈ మేరకు యంత్రాంగం ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసింది. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల ఓట్లను హాజీపూర్ మండలం ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో, పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను రామగుండం సెంటినరీ కాలనీలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కాలేజీలో లెక్కించనున్నారు. 2019లో మొత్తం ఏడు నియోజకవర్గాల ఓట్లను సెంటినరీ జేఎన్‌టీయూహెచ్ కాలేజీలోనే లెక్కించారు. ఆ సమయంలో ఫలితం వెలువడడంలో కొంత ఆలస్యమైంది. ఈసారి అలాంటి ఇబ్బందులేకుండా సాధ్యమైనంత త్వరగా కౌంటింగ్ పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు..

పోలింగ్ ముగిసిన రోజే స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచారు. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పైగా నిరంతరం సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తూ వస్తున్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచే కౌంటింగ్ మొదలు కానున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకమైన హాల్ చొప్పున మొత్తం మూడు గదులు కేటాయించారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్ల సమక్షంలో ఒక్కో టేబుల్ దగ్గర గెజిటెడ్ హోదా అధికారి పర్యవేక్షణలో గణిత ఉపాధ్యాయుడు సహాయకుడిగా.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అబ్జర్వర్‌గా ఉంటారు. ముందుగా ఈవీఎంలను తెరచి ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి లాటరీ పద్ధతిలో ఐదు చొప్పున పోలింగ్ కేంద్రాల స్లిప్పులను లెక్కిస్తారు. అనంతరం వాటిని కంట్రోల్ యూనిట్‌లో పోలైన ఓట్లతో సరిపోలుస్తారు. అనంతరం టేబుళ్ల వారీగా ఫలితాలను అధికారులు ప్రకటిస్తారు. కౌటింగ్ కోసం శిక్షణ తీసుకున్న అధికారులు, సిబ్బంది సోమవారమే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలోకి ఎవరూ రాకుండా నియంత్రిస్తున్నారు. ఈ మేరకు 24 గంటలపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మద్యం విక్రయాలు సైతం నిలిపివేస్తామని అధికారులు తెలిపారు.

ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

మంచిర్యాల జిల్లాలో కౌంటింగ్ నిర్వహించే ఐజా కాలేజీ

మొత్తం 136 రౌండ్లు..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 136 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపునకు 15 నిమిషాల నుంచి 20 నిమిషాల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన మధ్యాహ్నానికి తుది ఫలితం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత

రామగుండం సీపీ శ్రీనివాస్

హాజీపూర్/మంచిర్యాల ఏసీసీ, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అందరూ సహకరించాలన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద ఐదుగురు ఏసీపీలు, 14 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 112 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 96 మంది కానిస్టేబుళ్లు, 21 మంది ఉమెన్ హెడ్ కానిస్టేబుళ్లు, 21 ఉమెన్ కానిస్టేబుళ్లు, 80 మంది హోంగార్డులు, 3 స్పెషల్ పార్టీలు, కేంద్ర బలగాల సిబ్బంది డ్యూటీలో ఉంటారని తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఐదుగురికంటే ఎక్కువ మంది గుమికూడరాదని, పటాకులు కాల్చరాదని తెలిపారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు ఉన్న వారినే భద్రతా సిబ్బంది కౌంటింగ్ కేంద్రం లోకి అనుమతి ఇస్తుందన్నారు. విజయోత్సవ ర్యాలీల కోసం సంబంధిత పోలీస్ అధికారుల నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల ఏసీపీ రత్నప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐలు ఆకుల అశోక్, లక్షెట్టిపేట సీఐ అల్ల నరేందర్, మంచిర్యాల ట్రాఫిక్ సీఐ నరేశ్ తదితరులున్నారు.

కౌంటింగ్ కేంద్రను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

ఎమ్మెల్యే పీఎస్సార్ బాధ్యత వహించాలి

- హత్యారాజకీయాలు సరికాదు
- న్యాయం జరుగకుంటే రోడ్లపైకి వస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి రాకేశ్‌కు పరామర్శ

రాకేశ్‌పై దాడి చేసింది కాంగ్రెస్ గూండాలే

మంచిర్యాల టౌన్, జూన్ 3 : బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి గడప రాకేశ్‌పై దాడి ముమ్మాటికీ కాంగ్రెస్ గూండాల పనేనని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ బాధ్యత వహించాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాకేశ్‌ను సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి పరామర్శించారు. ఆయనకు తగిలిన గాయాలను పరిశీలించారు. అతి కిరాతకంగా బేస్‌బాల్ బ్యాట్లు, రాడ్‌లతో దాడి చేశారని, వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాల్క సుమన్ మాట్లాడుతూ రాకేశ్‌ను పథకం ప్రకారమే కొట్టారన్నారు. అతడిని చంపేందుకు కాంగ్రెస్ గూండాలు ప్రయత్నించారని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యే హస్తం ఉందని స్పష్టం అవుతోందని, పీఎస్సార్ ఇంటి ముందే ఈ దాడి జరిగిందన్నారు. ఇక్కడ ప్రజాపాలన జరుగడం లేదని, ప్రతీకార పాలన జరుగుతుందని చెప్పారు. ఐదునెలల కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులను హత్యచేశారని, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. మంచిర్యాలలో హత్యారాజకీయాలు సాగుతున్నాయని, ఇది సరైన పద్ధతికాదని హితవుపలికారు. ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ నాయకులు మంచి పాలన అందించాలని, ఇలాంటి ప్రతీకార దాడులు చేయడం, హత్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా ఎంతో అభివృద్ధి చేశామని, ఇలాంటి హత్యారాజకీయాలు ఏనాడూ చేయలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీస్ కమిషనర్‌ను కలుస్తామని చెప్పారు. సరైన న్యాయం జరుగకపోతే మేం రోడ్డు మీదకు వస్తామని, అప్పుడు ఏమైనా జరిగితే అందుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీ దాడులకు భయపడేది లేదని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కాపాడుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ ప్రత్యేకంగా లీగల్ టీంలను ఏర్పాటు చేసుకుందని, ఎక్కడైనా కార్యకర్తలకు అన్యాయం జరిగితే లీగల్ టీం ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఇలాంటి సంస్కృతి సరైంది కాదని, రాకేశ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు.

రాకేశ్ గాయాలను పరిశీలిస్తున్న బాల్కసుమన్, కొప్పుల ఈశ్వర్, దివాకర్‌రావు

ముమ్మాటికీ పీఎస్సార్ పనే : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బీఆర్ఎస్ నాయకుడు గడప రాకేశ్‌పై హత్యాయత్నం జరుగడం ముమ్మాటికీ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పనేనని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పీఎస్సార్ కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందని చెప్పారు. ఎన్నికలకు ముందు పీఎస్సార్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లలో రాకేశ్ సంగతి చూస్తానని చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెలేగా గెలిచిన ప్పటి నుంచి మంచిర్యాలలో గొడవలు జరుగుతున్నాయని, ప్రశాంతంగా ఉండే మంచిర్యాలలో అలజడి సృష్టిస్తున్నారని తెలిపారు. ఇది చిన్న సంఘటన అని కొట్టి పారేస్తున్నారని, 15 మంది గూండాలు కలిసి ఒక్క మనిషిపై రాడ్‌లు, కర్రలతో అతి దారుణంగా కొట్టి చంపాలని చూడటాన్ని చిన్న ఘటనగా చెప్పడం దారుణమన్నారు. గూండాలు జరిపిన దాడిలో శరీరం కమిలిపోయిందని, ఆ దెబ్బలు మీకే తగిలితే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని చెప్పుకొచ్చారు. ప్రజలందరూ ఈ విషయాలన్నింటినీ గమనిస్తున్నారని, ఇలా దాడులు చేస్తే ప్రజలు తిరగబడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, గాదెసత్యం, అంకం నరేశ్ పాల్గొన్నారు.

దాడితో ఎమ్మెల్యేకు సంబంధం లేదు

బీఆర్ఎస్ నాయకుడు గడప రాకేశ్‌పై జరిగిన దాడితో కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే పీఎస్సార్‌కు ఎలాంటి సంబంధం లేదని నాయకులు స్పష్టం చేశారు. సోమవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్ మాట్లాడారు. రెండు వర్గాల మధ్య జరిగిన దాడిని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పీఎస్సార్‌కు అంటగట్టాలని చూడడం సరికాదన్నారు. రాకేశ్‌పై దాడిని తాము కూడా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.

రాకేశ్‌పై దాడి చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల ఏసీసీ, జూన్ 3 : గడప రాకేశ్‌పై దాడి చేయించిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఈశ్వర్, పెద్దపల్లి జడ్పీ చైర్పర్సన్ పుట్ట మధుకర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర నాయకుడు విజిత్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం సీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

తాగిన మైకంలో అటవీ సిబ్బందిపై దాడి

జన్నారం, జూన్ 3 : తాళ్లపేట రేంజ్ పరిధిలోని తపాలాపూర్ ప్రధాన రహదారిలోని చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ సాయికుమార్, వాచర్ ఉత్కూర్ శ్రీనివాస్‌పై ఇద్దరు యువకులు తాగిన మైకంలో దాడి చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి కారు నడుపుకుంటూ వచ్చి యాక్సిడెంట్ చేయగా, దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన ఆడే శ్రావణ్‌కుమార్, తీగల ఉదయ్‌తో పాటు మరికొందరు బైక్‌పై వెంబడించారు. అటవీ సిబ్బంది కారును ఆపి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా, శ్రావణ్‌కుమార్, తీగల ఉదయ్ అక్కడికి చేరుకున్నారు. కారు డ్రైవర్‌తో గొడవకు దిగారు. అంతలోనే బీట్ ఆఫీసర్ సాయికుమార్ కలగజేసుకొని ఇక్కడ గొడవచేయవద్దని యువకులకు చెబుతుండగా, మద్యం మత్తులో ఉన్న శ్రావణ్‌కుమార్, ఉదయ్.. బీట్ ఆఫీసర్ సాయికుమార్, వాచర్ శ్రీనివాస్‌పై దాడి చేశారు. సాయికుమార్ తలకు తీవ్రగాయమైంది. వెంటనే దవాఖానకు తరలించారు. సోమవారం బీట్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు యువకులపై కేసు నమోదు చేశారు.

గాయపడ్డ బీట్ ఆఫీసర్ సాయికుమార్

ఇద్దరు ఈజీఎస్ టీఏల సస్పెన్షన్

కెరమెరి, జూన్ 3: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లను డీఆర్డీవో పీడీ సురేందర్ సస్పెన్షన్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మహ్మద్ అమ్జద్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో కూలీలు చేసిన పనుల కొలతల్లో తేడాలు ఉన్నాయని సామాజిక బృందం సభ్యులు పీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన టీఏలు రవీందర్, ధరంసింగ్‌ను పీడీ సస్పెన్షన్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సస్పెన్షన్‌కు గురైన రవీందర్ బోలపటార్, అంతాపూర్, నిషాని, కేలి(బి) గ్రామాల్లో, ధరంసింగ్ కరంజీవాడ, బోరిలాల్‌గూడ, పార్డ, దేవాపూర్, అగర్వాడ గ్రామాలో టీఏలుగా పని చేశారని ఎంపీడీవో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679